సంపాదకీయం


ఆదివారం 27-10-2024

# సమగ్ర వ్యవసాయ విధానమే శరణ్యం

ప్రభుత్వాలు రైతులను ఆదుకోవడం వదిలేసి కేవలం ఉచిత పథకాలతో వారిని బుట్టలో వేసుకునే ప్రయత్నాలు కొనసాగిస్తున్నాయి. సమగ్ర వ్యవసాయ విధానాలు రూపొందించడంలో పాలకులు ఎప్పటి కప్పుడు విఫలం అవుతూనే ఉన్నారు. ఇలా ఎన్నాళ్లు చేసిన ప్రయోజనం శూన్యమని తేలింది. రైతుబంధు, రైతు రుణమాఫీ అన్నది కేవలంతాతా÷–కాలిక లేపనం తప్ప మరోటి కాదు. ఇలా చేస్తూ పోతే ఖజానా గుల్లవ్వడం తప్ప రైతులు బాగు పడరు. అలా బాగుపడివుంటే ఈ పాటికి రాజులయ్యేవారు. అలా కాకుండా నిపుణులతో చర్చించి వారి సమస్యలను ఎజెండా చేసుకుని ముందుకు సాగాలి. నిజానికి రైతులకు కావాల్సింది ఇలాంటి తాయిలాలు కావని గుర్తించాలి. ముందుగా సాగునీట సమస్యను పరిష్కరించాలి. నీరు అందుబాటులో లేకుంటే కమ్యూనిటీ బోర్ల ద్వారా నీటిని అందించాలి. చెరువులు, కుంటలను బాగు చేయాలి. కాలువలను మరమ్మత్తులు చేయాలి. నదుల నుంచి నీరు చెరువల్లోకి వచ్చేలా చేయాలి. చిన్ననీటి వనరులను అభివృద్ధి చేయాలి. ఇకపోతే ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచాలి. ఏ పంటలు వేయాలో..ఏ భూమిలో ఏ పంటలు పండిస్తే మంచిదో ముందే తెలియచేయాలి. రైతులను కమిటీలుగా ఏర్పాటు చేసి వారు సమిష్టి వ్యవసాయం దిశగా అడుగులు వేసేలా చేయాలి. వారు వేసే పంటలను సకాలంలో మద్దతు ధరలు చెల్లించి కొనుగోలు చేయాలి. లేదా అందుకు తగ్గట్లుగా మార్కెట్‌ను కల్పించాలి. పంటలకు అవసరమైన రుణాలను తక్కువ వడ్డీలకు లేదా వడ్ఈలేని రుణాలను అందించాలి. ఉచిత కరెంట్‌ను కూడా అవసరమైన మేరకు మాత్రమే వినియోగించేలా నియంత్రణ చేయాలి. ప్రకృతి వైపరీత్యాల సమయంలో నష్టపోయిన పంటలకు వెంటనే పరిహారం అందించేలా బీమా సదుపాయం కల్పించాలి. ఇవన్నీచేయడం ద్వారా రైతులను ఆదుకోవచ్చు. అభివృద్ధి చేయవచ్చు. ఇప్పుడు వ్యవసాయానికి చేస్తున్న ఖర్చులను విభజిస్తే ఇవన్నీ సాకారం అవుతాయి. అలాగే పంటలు పండించే రైతులకు దీని ద్వారా నేరుగా మేలు జరుగుతుంది. పంటలు వేయని, పండిచని రైతులకు ఇవన్నీ వర్తించకుండా చూడాలి. నిజమైన రైతులకు ప్రయోజాలను కల్పించిన వారం అవుతాం. కానీ ఓటు బ్యాంక్‌కు అలవాటు పడ్డ పాలకులు, ఎంతసేపు రైతుబంధు, రుణమాఫీ అంటూ గోల చేస్తున్నారు. ఉచితవిద్యుత్, రైతుబంధు ద్వారా పంట పెట్టుబడి, సాగునీటి సౌకర్యాలు కల్పిస్తున్నా రైతులు అప్పుల్లో కూరుకుపోతున్నారు. పంటల కోసం తెగ అప్పులు చేసి, ఆ తరవాత తీర్చలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. రాష్ట్రంలో ఆత్మహత్యకు పాల్పడిన ఒక్కో రైతుకు సగటున రూ.3 నుంచి రూ. నాలుగున్నర లక్షల అప్పు, 5 ఎకరాల్లోపు భూములు ఉన్నట్లు గుర్తించారు. ఆత్మహత్య చేసుకున్న రైతుల్లో 92శాతం మంది కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫసల్‌బీమా యోజనలో చేరలేదని తెలుస్తోంది.47శాతం మంది రైతులు ఆత్మహత్యలు అప్పుల వల్లనే చేసుకుంటున్నట్లు ఎన్‌ఐఆర్‌డీపీఆర్ గుర్తించింది. రైతుల ఆదాయం తగ్గిపోయిందని, వేలల్లో ఆదాయం ఉంటే లక్షల్లో అప్పులు ఉండడం వల్లనే ఒత్తిడిలు భరించలేక అప్పుల పాలవుతున్నట్లు సర్వేలు చెబుతున్నాయి. అప్పులు ఇచ్చిన వారి ఒత్తిడి భరించలేక ఆత్మహత్యలు జరుగు తున్నట్లు నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్ గుర్తించింది. నవంబర్, ఏప్రిల్, మే నెలల్లో ఆత్మహత్యలు జరుగుతున్నాయి. రుణ మాఫీలు సరిగా జరగకపోవడం, దీనిపై సరైన నిర్ణయం లేకపోవడం వల్ల రైతుల్లో తీవ్రమైన అసంతృప్తి, ఆందోళన నెలకొంటుంది. దీనికి తోడు జిల్లాల్లో కౌలు రైతుల పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. కౌలు రైతుల్లో సగం మంది అప్పులపాలై ఆందోళన చెందుతున్నారు. వీరికి కనీసం రైతుబంధు లాంటి స్కీములు కూడా అమలు చేయకపోవడం వల్ల వారు అసంతృప్తితో ఉన్నారు. సాగుభూమి ఎప్పటికప్పుడు తగ్గిపోవడం, కమతాలు చిన్నవిగా ఉండడం, వ్యవసాయంపై ప్రభావం చూపుతున్నట్లు స్పష్టమవుతోంది. సాగు చేస్తున్న పంటలకు ఆశించిన ధరలు రాకపోవడం వల్ల రైతులకు ఇబ్బందులు ఎదురవు తున్నాయి. రైతుల అవసరాల మేరకు బ్యాంకులు రుణాలు అందించడం లేదు. దీంతో వడ్డీ వ్యాపారస్తుల వద్దకు వెళ్లాల్సి వస్తోంది. తీరా అప్పులు తీర్చలేక వారు ఆత్మహత్యలకు పాల్పడే పరిస్థితి ఏర్పడుతుంది. ప్రభుత్వ రుణమాఫీ పథకం అమలు చేస్తున్నప్పటికీ విడతల వారీగా బ్యాంకుల్లో జమ చేయడం వల్ల పెద్దగా ప్రయోజనం ఉండడం లేదు. 55 నుంచి 60 శాతం మంది రైతులు బ్యాంకుల నిబంధనలు భరించలేక ప్రైవేటు వడ్డీ వ్యాపారుల దగ్గర అత్యధిక వడ్డీలు చెల్లించి అప్పులను తీసుకుంటున్న దాఖలాలున్నాయి. ఇకపోతే ధాన్యం కొనుగోళు ఒక ఎత్తయితే తడిసిన ధాన్యం కొనడం మరో ఎత్తు. అకాల వర్షాలతో తడిసిన ధాన్యంతో రైతులు లబోదిబోమంటున్నా..పాలకులు ఎవరు కూడా పట్టించుకోవడం లేదు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ధాన్యం తడవడంతో పాటు పంటలు చాలావరకు నీటమునుగుతున్నాయి. వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం సకాలంలో రంగంలోకి దిగడంలేదు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఏటా తడిసిన ధాన్యంతో రైతులు లబోదిబో మంటున్నారు. మరోవైపు ధాన్యం కొనుగోళ్లు చేయాలని రైతులు ఆందోళన చెందుతున్నా ఆదుకునే వారు,సమాధానం చెప్పడం లేదు. ధాన్యం కొనుగోళ్లలో శ్రద్ద చూపని పాలకులు కిలో రూపాయి బియ్యం విషయంలో ఏ మాత్రం వెనక్కి తగ్గడం లేదు. మరోవైపు తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వం అందచేస్తున్న కిలో రూపాయి బియ్యం పథకం పక్కదారి పడుతోంది. రూపాయికి కొత్తిమీర కూడా లభించని ఈ రోజుల్లో ఇంకా ఈ పథకాన్నికొనసాగించడం ఆర్థిక భారం తప్ప మరోటి కాదు. ఆర్థిక మందగమనం నేపథ్యంలో అనేక పథకాలను సమీక్షించాల్సి ఉంది. నిరుపేదలకు ఉచిత పథకాలపై సమీక్షించకుంటే తెలుగు రాష్ట్రాల్లో ఆర్థికమాంద్యం కూడా తీవ్ర ప్రభావం చూపగలదు. ప్రజలు చెమటోడ్చి పన్నుల రూపంలో కట్టిన డబ్బులు వృధా పథకాలతో దుబారా చేస్తున్న పథకాలకు చరమగీతం పలకలి. నిజానికి ఈ డబ్బులతో రైతుల వద్ద ఉన్న ధాన్యం కొంటే కొంత ఊరట కలిగేది. ధాన్యం కొనడం వల్ల ఎంత ఖర్చవుతుందో అంత లెక్క కట్టి ఆ మేరకు బియ్యం పథకం ధరలను పెంచాలి. ప్రజల డబ్బులకు జవాబుదారీగా ఉండాల్సిన పాలకులు తమకు అనుగుణంగా, ఓటు బ్యాంక్ రాజకీయాల కోసం పథకాలను కొనసాగించడం సరికాదు. ఈ క్రమంలో సమగ్రవ్యవసాయ విధానంపై కసరత్తు చేయాలి. వ్యవసాయరంగ నిపుణులను, అనుభవమున్న రైతులను సమీకరించి సమగ్రంగా చర్చించాలి. అప్పుడే వ్యవసాయాన్ని పండగ చేయవచ్చు.

# బిజెపికి కళ్లెం వేసే ఉంచాలి!

న్యూఢిల్లీ,దేశ పాలనా రథానికి ఏ గుర్రాలు కట్టాలో దేశ పౌరులకు బాగా తెలుసు. మోడీ పదేళ్ల పాలన చూశాక ఓటర్లకు ఓ కొత్త ఆలోచన వచ్చింది. బిజెపి చేతిలో పగ్గాలు పెట్టినా పూర్తిగా వదిలేయకూడదని వారు అనుభవపూర్వకంగా నేర్చుకున్నారు. అందుకే గతంలో కన్నా ఈసారి లోక్‌సభలో 63 సీట్లు తగ్గించి అదుపులో ఉంచుకున్నారు. దేశంలోని రెండు ప్రధాన పార్టీల శక్తియుక్తులను సరిగ్గా అంచనా వేసిన జనం మోడీ జట్టును గెలిపించి, ఆయనకు ఎంత బలాన్ని ఇవ్వాలో కొలత వేసి మరీ అందించారు. ఇప్పుడు ఎన్‌డిఎలోని పక్షాలు దూరమైతే మోడీ ప్రభుత్వం కొనసాగే అవకాశం లేదు. ఈ పరిస్థితి బిజెపికి గత పదేళ్లలో రాలేదు. ఇదే జనం కోరుకున్నది కూడా.మోడీకి అన్ని విద్యలూ తెలుసు. దేశంలో ఇప్పుడు ఆయనకు సాటి రాజకీయనేత లేరని ఎన్నో సర్వేలు చెబుతున్నాయి. ఆయనను కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీతో తులనాత్మక విశ్లేషణ చేయడం కూడా అనవసరం. కాంగ్రెస్‌లో రాహుల్‌ను మించినవారు, రాజకీయ ఉద్దండులు ఉన్నా ఆ పార్టీకి యువరాజే అన్నీ. పార్టీని నమ్ముకున్నందుకు ఆయన పట్టాభిషేకం కోసం నేతలందరూ తంటాలు పడుతున్నారు. అయితే ప్రపంచ స్థాయి నాయకత్వ సూచీల ప్రకారం మోడీ దరిదాపుల్లో కూడా రాహుల్ కనబడడం లేదు. రాజకీయ క్రీడల్లో మోడీ మైదానం అంచుల దాక వెళ్లి అనుకున్నది సాధించగలరు. ఆ సామర్థ్యం ఉన్నవారు బిజెపిలో కాని, దేశంలో కాని మరొకరు లేరనే చెప్పాలి.అయితే మోడీ లక్ష్యాలు వేరు. ఆయనకు పూర్తి మెజారిటీ ఇచ్చిన పదేళ్ల కాలం లో ఆయన ప్రభుత్వ సంస్థలను నిర్వీర్యం చేయడం, బలంగా ఉన్నవాటిని ప్రైవేటుపరం చేయడం జరిగింది. పూర్తిగా పారిశ్రామికవేత్తల అనుకూల పాలన కొనసాగింది. ఆయనకు అదెంతో సంతృప్తిని ఇచ్చి ఉండాలి. మరో వైపు ఆ కాలంలో హిందూ మత ఛాందసం విర్రవీగింది. దళితులకు, మైనారిటీలకు రక్షణ కరువైంది. ఆ చర్యలను మోడీ ఎన్నడూ ఖండించలేదు. వారు ఆ హద్దుల్లో ఉండాల్సిందే అని ఆయన కూడా భావించి ఉంటారు. మోడీ సంపూర్ణంగా అగ్రకుల హిందువుల పక్షపాతి అని కొత్తగా రుజువు పరిచే అవసరం లేదు. జనాభాలో 2% ఉన్న అగ్రకులాలకు ఆయన ఇడబ్ల్యుఎస్ పేరిట 10% రిజర్వేషన్లు కల్పించడం బహుజన సమ్మతంకాదు. ఇక సబ్ కా వికాస్ అన్నది నామమాత్ర నినాదమే.ఆయన పాలనలో ముస్లిం లు ఏమాత్రం సంతోషంగా లేరు. దళితులు కులనిమ్నతకు కట్టివేయబడ్డారు. ఆర్టికల్ 370ని రద్దు చేసి కశ్మీర్ స్వయం ప్రతిపత్తిని తొలగించిన పరిణామాలను ఇటీవలి జమ్మూకశ్మీర్ ఎన్నికల ఫలితాల్లో చూశాం. ట్రిపుల్ తలాక్ రద్దు అనేది తమ సాంప్రదాయిక వ్యవహారాల్లో వేలు పెట్టడమే అని ముస్లిం సమాజం భావిస్తోంది. పూర్తి స్వేచ్ఛను ఇస్తే ఇలాంటి ఇబ్బందులు మరిన్ని తప్పవని సామాన్య జనం గ్రహించింది. బిజెపిని భయంలో ఉంచుకోకపోతే తమకు నష్టమే అని వారికీ తెలుసు. దీని ప్రభావం 2024 సాధారణ ఎన్నికల్లోనే కాకుండా ఆ తర్వాత జరిగిన, జరగబోయే ఎన్నికల్లో కూడా కనబడుతుంది. హర్యానాలో గెలుపు వ్యూహ ఫలితమే కానీ నిజమైన విజయం కాదు. 'ఇండియా' కూటమిలో కాంగ్రెస్, ఆప్ మధ్యన సీట్ల సర్దుబాట్లు కుదరక ఎవరికివారు పేరాశపడడంతో ఇద్దరి కొంపమునిగింది. ఇక నవంబర్‌లో జరగబోయే జార?ండ్, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు మోడీ పాలన కన్నా ఆయన ప్రతిష్ఠకు పరీక్షగా చూడాలి. ఈ రెండు రాష్ట్రాల్లో మోడీ 2.0 పాలనలో సాగిన రాజకీయ విన్యాసాన్ని ఆయన రాజకీయ చాణక్యనీతికి పరాకాష్ఠగా భావించాలి.కేంద్రంలో పూర్తి మెజారిటీ ఉన్నపుడు రాష్ట్రాల్లోని ప్రాంతీయ పార్టీలకు విలువే లేకుండా పోయింది. ఇప్పుడు సీను మారిపోయింది. ఒకనాడు లెక్కలోకి రాని చంద్రబాబు




ఇప్పుడు మోడీని ఆడుకొనే దశకు చేరిపోయాడు. ఇలా మోడీకి పగ్గాలు పడాల్సిందే! ఈ పరిస్థితికి లోలోన మదనపడుతున్న మోడీ తన గత వైభవాన్ని తిరిగి చేరుకోవాలని తీవ్రంగా కోరుకుంటున్నారు. ఒకరు పంచన బతికే బతుకు ఆయనకు ఇష్టముండదు. జార?ండ్, మహారాష్ట్రలో ఎన్నికల్లో కూడా ఎన్‌డిఎ కూటమికి అనుకూలత తక్కువే. అక్కడ కాంగ్రెస్ కూటమికి అవకాశాలు పెరుగుతున్నాయి. ఢిల్లీలో కేజ్రీవాల్ సానుభూతి పవనాల ఆశతో ఎన్నికలకు సిద్ధంగా ఉన్నాడు. వీటి ఫలితాలు ఎలా ఉన్నా దేశంలో ఓటర్లను తిరిగి తనవైపు తిప్పుకోవడానికి మోడీ కొత్త ప్రణాళికలు వేస్తున్నారు. కేవలం మతం, భక్తి భావనలు హిందూ ఓట్లను గంపగుత్తగా రాబట్టలేవని అద్వానీ కాలం నుండే రుజువు అవుతోంది. అయోధ్య ఆలయానికి రూ. 3500 కోట్లు అర్పించిన జనం అదే చోట బిజెపిని గెలిపించకపోవడం ఆ పార్టీకి చక్కని గుణపాఠమే. ఉన్నంతలో హిందూ ఓటు బ్యాంకు చెక్కుచెదరదు. అయితే అదొక్కటే పార్టీని గట్టెకించలేదు. అందుకే ప్రజలను ఆకర్షించే నిర్ణయాలు కొన్నయినా తీసుకోవాలి అనే ఆలోచన ఇప్పుడు కార్యరూపం దాల్చుతోంది.తన ప్రాభవాన్ని వెనక్కి తెచ్చుకొనేందుకు మోడీ గత నిర్ణయాల సవరణ బాట పట్టారు. వాటిలో ప్రధానమైన వాటిని పరిశీలిద్దాం. కేంద్ర ప్రభుత్వం ఆగస్టు లో ఆమోదించిన యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్, సెప్టెంబర్‌లో ప్రకటించిన 70 ఏళ్లు పైనబడినవారికి ఆరోగ్యం బీమా పథకం ప్రభుత్వంపై ఆర్థిక భారాన్ని మోపేవే. అయితే ఈ రెండు పథకాలు బిజెపి ఓట్ల శాతాన్ని గణనీయంగా పెంచుతాయి. 2004 నుండి పాత పింఛను విధానం కోల్పోయినందుకు ఉద్యోగ వర్గాలు చాలా నిరాశలో ఉన్నాయి. జాతీయ పింఛన్ విధానం ఉద్యోగుల విశ్రాంత జీవితానికి పూర్తి భరోసా ఇవ్వలేదు. మధ్యే మార్గంగా రూపొందించిన సమీకృత పింఛన్ విధానం కొంత ఆశాజనకంగా ఉంది. 50% చివరి జీతం, 60% ఫ్యామిలీ పెన్షన్, 10 ఏళ్ల సర్వీసుకు రూ.10 వేల పెన్షన్ దీనిలోని ప్రత్యేకతలు. ఇక 70 ఏళ్లు పైబడిన వారందరికీ రూ.5 లక్షల ఆరోగ్య బీమా ఇప్పటికే ఎంతో ప్రచారంలోకి వెళ్ళింది. దేశమంతా దీన్ని సంబరంగా ఆహ్వానిస్తున్నారు.ఎలాంటి నిబంధనలు లేకుండా ఆ వయస్కులందరికీ ఇది వర్తిస్తుంది అనడమే దీని ప్రధాన ఆకర్షణ. బీమా ఆశించే సీనియర్ సిటిజన్ల కుటుంబాలు అన్నీ మోడీకి బాసటగా నిలుస్తాయి. దేశంలోని 90 కోట్ల ఓటర్లలో 30 కోట్లకు పైగా వీటి పరిధిలోకి వస్తారు. అయితే సామాన్య ప్రజలపై ప్రేమతో ఈ సంక్షేమ పథకాలను మోడీ స్వయంగా ప్రకటించినవిగా భావించకూడదు. కోల్పోయిన ఓట్ల సంఖ్యను సరిచేసుకునే మోడీ ప్రణాళికలో భాగంగానే చూడాలి. ఒకప్పుడు మోడీ ఓటరు గుర్రంపై కూచొని కర్రకు గడ్డి కట్టి అందుకో అన్నట్లు పరిగెత్తించారు. ఇప్పుడు సీను రివర్స్ అయి ఓటరు మోడీ నాడి పట్టుకున్నాడు. సమర్థుడి ఆలోచనలను జన సంక్షేమానికి మళ్లించడానికి కళ్లెమే బ్రహ్మాస్త్రం.

# భారత్, చైనాల మధ్య కుదిరిన సయోధ్య

న్యూఢిల్లీ,భారత్, చైనాల మధ్య వాస్తవాధీన రేఖ వెంబడి గత నాలుగేళ్లుగా కొనసాగుతున్న ఉద్రిక్తతలకు ముగింపు పలికేలా ఇటీవల ఇరుదేశాల మధ్య కీలక ఒప్పందం జరిగింది. ఇది చర్చలకు ఉన్న బలమని కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యానించారు. అందుకు అనుగుణంగానే సరిహద్దుల్లో బలగాల ఉపసంహరణ పక్రియ తాజాగా మొదలైంది. తూర్పు లద్దాఖ్ సెక్టార్‌లోని రెండు కీలకప్రాంతాలైన డెమ్చోక్, డెస్పాంగ్ నుంచి రెండు దేశాల బలగాలు వెనక్కి మరలుతున్నట్లు భారత రక్షణశాఖ అధికారులు శుక్రవారం వెల్లడించారు. ఒప్పందం ప్రకారం.. ఈ ప్రాంతంలోని సైనిక సామగ్రి, ఇతర పరికరాలను భారత బలగాలు వెనక్కి తీసుకొస్తున్నట్లు ఆ అధికారులు పేర్కొన్నారు. ఇక్కడి టెంట్లు, తాత్కాలిక నిర్మాణాలను కూడా ఇరుదేశాల బలగాలు తొలగిస్తున్నట్లు వెల్లడించారు. చార్డింగ్ లా పాస్‌కు సమీపంలోని నదికి పశ్చిమదిశగా భారత బలగాలు, తూర్పు దిశగా చైనా బలగాలు వెనక్కివెళ్తున్నట్లు పేర్కొన్నారు. ఈప్రాంతాల్లో సరిహద్దులకు ఇరువైపులా దాదాపు 10–12 తాత్కాలిక నిర్మాణాలు, 12 టెంట్లు ఉన్నట్లు తెలుస్తోంది. బలగాల ఉపసంహరణ పక్రియంతా పూర్తయిన తర్వాత మరో 4–5 రోజుల్లో డెస్పాంగ్, డెమ్చోక్ ప్రాంతాల్లో పెట్రోలింగ్‌ను పునరుద్ధరించనున్నట్లు సమాచారం. వాస్తవాధీన రేఖ వెంబడి గస్తీ పునఃప్రారంభంపై ఇరుదేశాల మధ్య ఇటీవల ఒప్పందం కుదిరింది. దీనిప్రకారం.. 2020 గల్వాన్ ఘర్షణలకు ముందు నాటి యథాస్థితి ఎల్‌ఏసీ వెంబడి కొనసాగనుంది. ఇరుదేశాల సైనికులు 2020లో గస్తీ నిర్వహించిన పెట్రోలింగ్ పాయింట్లకు స్వేచ్ఛగా వెళ్లొచ్చు. ఇటీవల జరిగిన బ్రిక్స్ సదస్సులో ఈ ఒప్పందాన్ని ఇరుదేశాల నేతలు మోదీ, జిన్‌పింగ్ ధ్రువీకరించారు. 2020 జూన్ 15న తూర్పు లద్దాఖ్‌లోని గల్వాన్ లోయలో భారత్–చైనా సైనికుల మధ్య జరిగిన తీవ్ర ఘర్షణ ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది. ఈ ఘర్షణలో తెలంగాణకు చెందిన కర్నల్ సంతోష్‌బాబు సహా 20 మంది భారత సైనికులు వీరమరణం పొందారు. చైనా కూడా భారీగా సైనికులను కోల్పోయింది. కానీ ఆ సంఖ్యను వెల్లడించలేదు. చాలా నెలల తర్వాత ఐదుగురు చనిపోయినట్లు అధికారికంగా అంగీకరించింది. ఈ ఘర్షణల నేపథ్యంలో ఇరుదేశాలు ఎల్‌ఏసీ వెంబడి భారీస్థాయిలో బలగాలను మోహరించాయి. అప్పటినుంచి రెండుదేశాల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఆ తర్వాత ప్రతిష్టంభనను తొలగించేందుకు ఇరుదేశాల మధ్య పలుమార్లు దౌత్య, కమాండర్ స్థాయి చర్చలు జరిగాయి. వాటి ఫలితంగా ఇప్పటికే కొన్ని ప్రాంతాల నుంచి బలగాలను ఉపసంహరించగా.. ఘర్షణల కేంద్రమైన డెమ్చోక్, డెస్పాంగ్ వద్ద మాత్రం బలగాలు కొనసాగుతూ వచ్చాయి.

# నౌక ఢీకొనడంతో కూలిన బాల్టిమోర్ వంతెన

న్యూయార్క్,అమెరికాలోని బాల్టిమోర్‌లో నౌక ఢీకొనడంతో ఓ వంతెన కూలి పోయింది. ఈ ఏడాది మార్చిలో జరిగిన ఈ ఘటనపై కార్గోషిప్‌కు చెందిన యజమానితో రూ.840 కోట్ల నష్టపరిహారం చెల్లింపునకు ఒప్పందం జరిగినట్లు అమెరికా న్యాయశాఖ తెలిపింది. 'ఆరుగురి ప్రాణాలు బలిగొనడంతో పాటు భారీ నష్టాన్ని కలిగించిన ఈ ఘోరమైన ఘటనకు దాదాపు ఏడు నెలల తర్వాత పరిష్కారం లభించింది. మేము ఒక ముఖ్యమైన మైలురాయిని చేరుకున్నాం. గ్రేస్ ఓషన్ ప్రైవేట్ లిమిటెడ్, సినర్జీ మెరైన్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్తంగా 101.1 మిలియన్ డాలర్లు (రూ.840 కోట్లు) చెల్లించేందుకు అంగీకరించాయని న్యాయశాఖ అధికారి బెంజమిన్ మిజర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇదిలాఉండగా.. ఫ్రాన్సిస్ స్కాట్ కీ వంతెన పునర్నిర్మాణానికి సంబంధించిన నష్టపరిహారాన్ని ఈ ఒప్పందంలో చేర్చలేదని న్యాయశాఖ వెల్లడించింది. ఇది మేరీల్యాండ్ రాష్ట్రానికి చెందిన ప్రత్యేక దావా అంశమని పేర్కొంది. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన ఆరుగురు కార్మికుల కుటుంబాలు దాఖలు చేసిన పిటిషన్లపై వాదనలు కొనసాగుతున్నట్లు తెలిపింది. నౌక ఢీకొనడంతో పటాప్‌స్కో నదిపై ఉన్న ఫ్రాన్సిస్ స్కాట్ కీ వంతెన కుప్పకూలిన విషయం తెలిసిందే. అమెరికా కాలమానం ప్రకారం.. మార్చి 25న అర్ధరాత్రి దాటాక జరిగిన ఈ ఘటనలో ఆరుగురు మృతి చెందారు. ఆ సమయంలో నౌకలో భారత సిబ్బంది సైతం ఉన్నారు. అయితే, ప్రమాదానికి ముందే వారు అధికారులను అప్రమత్తం చేయడంతో వంతెనపై రాకపోకలను నిలిపివేయ గలిగారు. దీంతో భారీస్థాయి ప్రాణనష్టం తప్పిందని అప్పట్లో అధికారులు వెల్లడించారు.

# అదుపులేని ఆహార ద్రవ్యోల్బణం



హైదరాబాద్,దేశంలోని ఆహార ద్రవ్యోల్బణం ఈ ఏడాది జులైలో 5.4 శాతానికి, ఆగస్టులో 5.6 శాతానికి 13 నెలల దిగువ స్థాయికి మందగించినప్పటికీ, సెప్టెంబర్ వచ్చేసరికి అమాంతంగా 9.2 శాతానికి పెరిగిపోవడం ఆందోళన కలిగిస్తోంది. గ్రామీణ, పట్టణ, జాతీయ స్థాయిలో జనాభా వినియోగించే ఆహార వస్తువుల రిటైల్ ధరల్లో మార్పులు బట్టి వినియోగదారుల ఆహార ధరల సూచిక (కన్స్యూమర్ ప్రైస్ ఇండెక్స్ సిఎఫ్‌పిఐ) ఆధారంగా గత జులై, ఆగస్టు నెలల్లో ద్రవ్యోల్బణం మందగించినట్టు అంచనాగా తేలింది. జూన్ లో వినియోగదారుల ధరల సూచీ (సిపిఐ) ఆధారిత ద్రవ్యోల్బణం 5.08 శాతంగా నమోదైంది.కూరగాయల ధరలు జులైలో 6.8 శాతం, ఆగస్టులో 10.7 శాతం పెరగ్గా, సెప్టెంబర్‌లో 35.9 శాతం ఒక్కసారిగా పెరిగిపోయాయి. ఈ అత్యధిక ఆహార ద్రవ్యోల్బణం కొనుగోలు శక్తి అంతగాలేని బలహీన వర్గాలపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. పప్పుధాన్యాలు సంబంధిత ఉత్పత్తుల ధరలు 2022 ఆగస్టు నుంచి రెండేళుగా 7 నుంచి 17 శాతం స్థాయిలో స్థిరంగా ఉన్నప్పటికీ, 2023 జూన్ నుంచి 10 నుంచి 21 శాతం స్థాయిలో రెండంకెల వరకు పెరగడం ప్రారంభించాయి. కందులు, శనగలు, మినుములు, ధరలు బాగా పెరిగాయి. అదే విధంగా 2023 జులై నుంచి కూరగాయల ధరలు 20 శాతం కన్నా ఎక్కువగా అమాంతంగా పెరుగుతున్నాయి.మరోవైపు ఖాద్యతైలాలు (వంట నూనెలు) నెయ్యి వంటి ధరలు అత్యధిక స్థాయిలో 2023 ఫిబ్రవరి నుంచి పెరుగుతున్నాయి. దిగుమతుల సుంకాలు స్వల్పంగా తగ్గించడంతో వీటి దిగుమతులు కాస్తా పెరిగాయి. 2024 సెప్టెంబర్ నుంచి ఖాద్య తైలాలు, కొవ్వు పదార్థాల ధరలు 2.5 శాతం వరకు పెరిగాయి. కస్టమ్స్ డ్యూటీ పెంపు సెప్టెంబర్ 14 నుంచి అమలు లోకి రావడంతో వంట నూనెలు, కొవ్వు పదార్థాల ధరలు రానున్న నెలల్లో మరీ ఎక్కువగా పెరిగే అవకాశం కనిపిస్తోంది. గత ఐదేళ్ల లో శనగల దిగుమతులను నియంత్రించి, స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించాలన్న సంకల్పంతో ముఖ్యమైన పప్పుధాన్యాలు, చమురు గింజల కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) లను 20 శాతం వరకు గణనీయంగా పెంచారు. అయితే పెసలు, నూనె గింజలు, ఆవాలు, సోయాబీన్ సాగు విస్తీర్ణం మాత్రమే క్రమంగా 13 శాతం, 34 శాతం, 9 శాతం పెరిగింది. అదే సమయంలో మిగతా ముఖ్యమైన పప్పుధాన్యాలు, నూనె గింజలు, సాగు విస్తీర్ణం తగ్గిపోయింది.202425 ఖరీఫ్ సీజన్‌లో ప్రధాన పప్పుధాన్యాలు, నూనె గింజలు, కనీస మద్దతు ధర 6 నుంచి 8 శాతం వరకు పెరిగింది. అయినా కొన్ని ఎంపికైన పంటల ఉత్పత్తిలో పురోగతి 2024 అక్టోబర్ 7 వరకు పరిమితంగానే ఉంది. అందువల్ల సాగు విస్తీర్ణంపై కనీస మద్దతు ధర ప్రభావం అంతగా కనిపించక అనిశ్చితి ఏర్పడింది. దీంతో ఉత్పత్తులు కూడా ఆశించినంతగా పెరగలేదు. ప్రధానమైన పప్పుధాన్యాలు, వేరుశెనగ, శనగలు, పత్తి పంటలతో పోల్చుకుంటే కందిపప్పు, శనగలు, మినుములు, సోయాబీన్, పొద్దుతిరుగుడు ఉత్పత్తులు గత నాలుగు దశాబ్దాలుగా స్తంభించిపోయాయి. వీటి సాగు నీటిపారుదల లేని, మామూలు భూములకే పరిమితమైంది. ఖరీఫ్ సీజన్‌లో పప్పుధాన్యాల సాగు విస్తీర్ణం మితంగా 7 శాతం వరకు విస్తరించగా, నూనెగింజల సాగు గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే కేవలం 2.7 శాతమే పెరిగింది.ప్రధాన పప్పుధాన్యాల్లో కందిపప్పు, పెసలు, సాగు విస్తీర్ణం మాత్రం బాగా పెరిగింది. మినుములు సాగు 8 శాతం వరకు పెరిగింది. ఇక నూనె గింజల సాగును పరిశీలిస్తే వేరుశెనగ సాగు మాత్రం 9 శాతం వరకు పెరగ్గా, సోయాబీన్ సాగు అక్టోబర్ 7 వరకు కేవలం 2.5 శాతం మాత్రమే పెరగడం గమనార్హం. పంటలను కనీస మద్దతు ధరకు ఎవరూ కొనుగోలు చేయకపోవడంతో నూనెగింజలు, పప్పుధాన్యాల సాగు వైపు రైతులు దృష్టి పెట్టడం లేదు. గత రెండేళ్లుగా నూనెగింజలు ముఖ్యంగా సోయాబీన్, పొద్దుతిరుగుడు సాగు బాగా పడిపోయింది. వీటి హోల్‌సేల్ మార్కెట్ అంతగా అనుకూలం లేదు. ప్రపంచ మార్కెట్‌లో పప్పుధాన్యాల లభ్యత పరిమితంగా ఉండటంతో పప్పుధాన్యాల దిగుమతులు కొంచెం పెరిగే అవకాశం కనిపిస్తోంది. వాతావరణ మార్పులకు తగ్గట్టు సాంకేతిక విధానాలు, ఇతర ప్రక్రియలు అవలంబించి పంటల దిగుబడులను మరింత పెంపొందించడం తప్పనిసరి. నేల, నీరు తదితర సహజ వనరులను చాలా పొదుపుగా సమర్థంగా వినియోగించుకుంటేనే సత్ఫలితాలు వస్తాయి. అలాగే రైతులు తాము పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లభించేలా మార్కెటింగ్ విధానాలు రవాణా సౌకర్యాలు అభివృద్ధి చేయడం కూడా ఎంతో అవసరం.

## మరి గంటల్లో పెళ్లి.. వరుడికి ఊహించని షాక్

కర్నూలు : కర్నూలు జిల్లా పత్తికొండలో కొన్ని గంటలలో జరగవలసిన పెళ్లి ఆగిపోయింది. అనంతపురంకి చెందిన నరేంద్ర కుమార్ కుమార్తె వైష్ణవికి, కృష్ణగిరి మండలం లక్కసాగరం గ్రామానికి చెందిన బజారి కుమారుడు విశ్వాసికి పెద్దలు పెళ్లి నిశ్చయించారు. తెల్లవారితే పెళ్లి, రాత్రి సంప్రదాయాల ప్రకారం చిన్నతంబులం,పెద్ద తాంబూలం కూడా చేశారు. అయితే అమ్మాయికి ఇష్టం లేకపోవడంతో నాలుగు గంటలకు గోపాల్ ప్లాజా కళ్యాణ మండపం నుండి వెళ్లిపోయింది. కొన్ని గంటలలో జరగాల్సిన పెళ్లి నిలిచిపోయింది. పెళ్లి నిలిచిపోవడంతో పెళ్లి కుమార్తె తండ్రి కన్నీరు మున్నీరయ్యారు. పత్తికొండ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

# దగ్గర పడుతున్న అమెరికా అధ్యక్ష ఎన్నికలు

వాషింగ్టన్,అమెరికా అధ్యక్ష ఎన్నికలు సమీపిస్తున్నవేళ అధ్యక్ష అభ్యర్థుల ప్రచారం మరింత జోరందుకుంది. ఓటర్లను ఆకట్టుకోవడం కోసం హామీలతో పాటు పరస్పర విమర్శలతో ప్రచారం అంతకంతకూ వేడెక్కుతోంది. తాజాగా అగ్రరాజ్య ఉపాధ్యక్షురాలు, డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి కమలాహారిస్ పై రిపబ్లికన్ అభ్యర్థి, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి వ్యక్తిగత విమర్శలకు దిగారు. ఆమె అధికారంలోకి వస్తే చైనా ఆడేసుకుంటుందని ఎద్దేవా చేశారు. ప్రచారంలో భాగంగా ట్రంప్ ఓ రేడియో కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా హోస్ట్ మాట్లాడుతూ.. ఒకవేళ కమలాహారిస్ విజయం సాధిస్తే ఆమె చైనా అధినేత షీ జిన్‌పింగ్‌తో చర్చలు జరపాల్సి ఉంటుంది. అప్పుడు ఆమెతో జిన్‌పింగ్ ఎలా వ్యవహరిస్తారని ట్రంప్‌ను ప్రశ్నించారు. దీనికి మాజీ అధ్యక్షుడు బదులిస్తూ.. 'ఓ చిన్న పిల్ల మాదిరిగా ఆమెను చూస్తారని అంటూ వ్యాఖ్యానించారు. ఆమెను చిన్న పిల్లను చేసి చాక్లెట్లను లాగేసినట్లు మనదంతా దోచుకుంటారు. ఏం జరుగుతుందో కూడా ఆమెకు అర్థం కాదు. చెస్‌ను అప్పుడే మొదలుపెట్టిన ఆటగాడితో గ్రాండ్ మాస్టర్ ఆడితే ఎలా ఉంటుందో.. వారిద్దరి చర్చలు కూడా అలాగే ఉంటాయని అంటూ ట్రంప్ ఎద్దేవా చేశారు. ఆమెకు మరో నాలుగేళ్లు అధికారిమిస్తే ప్రజల జేబులన్నీ ఖాళీ చేస్తారంటూ దుయ్యబట్టారు.ఈ ఎన్నికల్లో ట్రంప్, హారిస్ మధ్య ఉత్కంఠ పోరు ఉండనున్నట్లు పోల్ సర్వేలు అంచనా వేస్తున్నాయి. ఈ సర్వేల్లో మొన్నటివరకు హారిస్ ఆధిక్యంలో ఉండగా.. తాజాగా ట్రంప్ కాస్త ముందంజలోకి వచ్చారు. వాల్ స్ట్రీట్ జర్నల్ నిర్వహించిన సర్వేలో ట్రంప్‌నకు 47శాతం మద్దతు రాగా.. హారిస్‌కు 45శాతం ఓట్లు పోలయ్యాయి. ఇక, సీఎన్‌బీసీ ఆల్ అమెరికన్ ఎకనమిక్ సర్వేలోనూ ట్రంప్ .. హారిస్ కంటే రెండు పాయింట్ల ఆధిక్యంలో ఉన్నారు. అటు స్వింగ్ రాష్ట్రాల్లోనూ ట్రంప్, హారిస్ మధ్య పోరు పోటాపోటీగా ఉండనున్నట్లు సర్వేలు అంచనా వేస్తున్నాయి.

# ‘నవ్విపోదురుగాక.. నాకేటి’ అన్నట్లుంది మాజీ మంత్రి ఉషశ్రీ తీరు



హిందూపురం: ‘నవ్విపోదురుగాక.. నాకేటి’ అన్నట్లుంది మాజీ మంత్రి. వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ తీరు. వైసీపీ అధికారం కోల్పోయి, కూటమి ప్రభుత్వం కొలువుదీరి నెలలు గడుస్తున్నా. ఆమె ఇంకా మంత్రి అనే భ్రమల్లోనే ఉన్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతి చిన్న విషయానికీ, సొంత పార్టీ నాయకులదే తప్పు ఉన్నా.. హడావుడి చేస్తున్నారు. పోలీసు స్టేషన్‌లోనే రెచ్చిపోతున్నారు. పోలీసు అధికారులపై చిందులేస్తున్నారు. హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఆదేశాలిస్తున్నారు. అవసరమైతే పోలీసులకే సెక్షన్లు చెబుతున్నారు. ఆమె తీరుపట్ల పోలీసులు, ప్రజలే కాదు. సొంత పార్టీ నాయకులు కూడా విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ‘ఉద్యోగులు మేం చెప్పింది చేయాలి. మేం అక్రమాలు చేస్తున్నా చూస్తూ ఉండాలి. మేం దౌర్జన్యం చేసినా స్పందించకూడదు. మేం తిట్టినా పడుండాలి. కాదంటే దాడులకు దిగుతాం, దౌర్జన్యాలు చేస్తాం.’ రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు, పోలీసులపై గత ఐదేళ్లలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు ప్రవర్తించిన తీరు ఇది. కూటమి ప్రభుత్వం కొలువుదీరి ఐదు నెలలవుతున్నా ఇప్పటికీ కొంతమంది వైసీపీ నాయకులు.. ఇంకా వారే అధికారంలో ఉన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఇది వారి పార్టీ ఉనికి కోసమా.. గత ఐదేళ్లలో ప్రవర్తించిన తీరు మార్చుకోలేకపోతున్నారో అర్థంకాని పరిస్థితి. వైసీపీ నాయకులు గతంలో పోలీసులపైనే ఎదురుకేసులు పెట్టారు. పోలీసులను చూసి నేరగాళ్లు భయపడతారు. రాష్ట్రంలో గత వైసీపీ హయాంలో అందుకు విరుద్ధంగా పరిస్థితులు ఉండేవి. వైసీపీ నాయకుల అరాచకాలు చూసి పోలీసులే భయపడ్డారు. ఆ పార్టీ నాయకులు చేసిన వికృతచేష్టలు అన్నీ ఇన్నీ కావు. కూటమి ప్రభుత్వం కొలువుదీరినా పోలీసులను ఆదే తీరులో చెదిరించేలా వైసీపీకి చెందిన జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ వ్యవహరిస్తున్నారని పోలీసులే చెప్పుకోవడం గమనార్హం. ఆమె వైసీపీ జిల్లా అధ్యక్షురాలిగా ఎంపికైన అనంతరం ఉనికి చాటుకునే ప్రయత్నాలు చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎక్కడ, ఎలాంటి ఘటన జరిగినా ఆమె అక్కడికి చేరుకుని, వాస్తవాలను పక్కనబెట్టి పోలీసులను టార్గెట్ చేస్తూ విమర్శలు గుప్పిస్తున్నారు. ఆమె తీరుపై పోలీసులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

ఉష తీరుకు నిదర్శనాలు కొన్ని..

హిందూపురం పట్టణ పరిధిలోని కొల్లకుంటలో సెప్టెంబరు 10న వైసీపీ, టీడీపీ నాయకుల మధ్య ఘర్షణ జరిగింది. ఇరుపార్టీల వారికి గాయాలయ్యాయి. వైసీపీ నాయకులు చాకచక్యంగా టీడీపీ వారు దాడిచేసిన వీడియోలు తీసి సోషల్ మీడియాలో వైరల్ చేశారు. వైసీపీ నాయకులు దాడిచేసి, రెచ్చగొట్టిన వీడియోలు లేవు. ఆ మరుసటి రోజే.. ఉషశ్రీ హిందూపురానికి చేరుకుని, ఆస్పత్రిలో వైసీపీ నాయకులను పరామర్శించారు. అక్కడి నుంచి అంబేద్కర్ సర్కిల్ చేరుకుని హల్ చల్ చేశారు. కేసు నమోదు చేశామని పోలీసులు చెప్పినా.. ఆమె వినకుండా దురుసుగా వ్యవహరించారు. తాను ఎవరినో తెలుసుకోవాలంటూ హెచ్చరించారు. పోలీసులు మాత్రం సంయమనం పాటించారు. దీంతో ఆమె మరింత రెచ్చిపోయి మాట్లాడారు. పోలీసులకే సెక్షన్లు చెప్పారు. దీంతో పోలీసులే ఒకింత అసహనానికి లోనయ్యారు. ఇటీవల చిలముత్తూరు మండలంలో సామూహిక అత్యాచార బాధితురాలిని పరామర్శించేందుకు వచ్చిన ఆమె.. ప్రభుత్వ ఆస్పత్రి వద్ద కాసేపు హంగామా చేశారు. తమనే లోపలకు పంపరా అంటూ పోలీసులపై చిర్రు బుర్రు లాడారు. ఈ సందర్భంగా ఆమె వ్యవహరించిన తీరు బాగాలేదంటూ పోలీసులే పెదవి విరిచారు.

# తెలంగాణలో మరో ఎయిర్‌పోర్ట్...



హైదరాబాద్,వరంగల్ మామునూరులో ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి గ్రహణం వీడింది. 150 కిలోమీటర్ల నిబంధనను పక్కకు పెట్టి నిర్మాణానికి GMR సంస్థ ఒప్పుకున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం 950 ఎకరాల భూమి అవసరమని అధికారులు అంచనా వేస్తున్నారు. త్వరలో దీనిపై అధికారిక ప్రకటన రానుంది. తెలంగాణలో మరో విమానాశ్రయం ఏర్పాటు రంగం సిద్ధమైంది. వరంగల్ జిల్లాలోని మామునూరులో 1930లో నిజాం హయాంలో ఏర్పాటు చేసిన ఎయిర్ పోర్ట్ 1980లో కొన్ని కారణాల వల్ల మూతపడి ఉంది. కాగా ఆ నాటి నుంచి నేటి వరకు ఎయిర్ పోర్ట్ వినియోగం లో లేదు. తాజాగా మామునూరు విమానాశ్రయానికి విమాన రాకపోకలు జరగనున్నట్లు అధికారిక వర్గాల నుంచి సమాచారం అందుతోంది. ఇప్పటికే దీనిపై సివిల్ ఏవియేషన్ మంత్రిత్వ శాఖ సర్వేలు కూడా చేసినట్లు తెలుస్తోంది. దీనిపై త్వరలోనే ప్రకటన విడుదల చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం.

150 కి.మీ వరకు నో ఎయిర్ పోర్ట్....

రెండు తెలుగు రాష్ట్రాలు వేరు కాకా ముందు.. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ గా ఉన్న సమయంలో ఆనాటి ప్రభుత్వం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని శంషాబాద్ లో నిర్మించింది. GMR సంస్థకు నిర్మాణ కాంట్రాక్ట్ ను అప్పగించింది. అయితే కొన్ని నిబంధనల నడుమ ఈ నిర్మాణ ఒప్పందం చేసుకుంది ప్రభుత్వం. అయితే.. నిబంధనల ప్రకారం శంషాబాద్ విమానాశ్రయానికి 150 కి.మీ.ల పరిధిలో 30 ఏళ్ల పాటు (2038 వరకూ) వాణిజ్య విమానాశ్రయాలను ఏర్పాటు చేయవద్దని ఆ సంస్థ ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. తాజాగా ఆ ఒప్పందాలను పక్కకి పెట్టి మామునూరులో విమానాశ్రయం నిర్మాణానికి ఒప్పుకున్నట్లు సమాచారం. కాగా.. ఈ నిర్మాణానికి మొత్తం 950 ఎకరాల భూమి అవసరమని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం 696 ఎకరాల భూమి ఏఏఐ పరిధిలో అందుబాటులో ఉండగా, మరో 253 ఎకరాల భూమి సేకరించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

విమానాశ్రయం ఉందని మర్చిపోయారు...

తెలంగాణలో శంషాబాద్ విమానాశ్రయం కాకుండా ఇంకొకటి ఉందని చాలా మంది మర్చిపోయారు. అయితే ఇది ఇప్పుడు కొత్తగా నిర్మించింది ఏమి కాదు.. వరంగల్ జిల్లాలోని మామునూరులో 1930లో నిజం కాలంలో నిర్మించారు. కొన్ని ఏళ్ళ పాటు అక్కడ విమాన సేవలు నడిచాయి. అయితే కొన్ని కారణాల వల్ల అతి మూతపడింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు అది పశువులను పెపేందుకు స్థలం లాగా మిగిలిపోయింది. 2017లో కేంద్రం తీసుకొచ్చిన ‘ఉడో దేశ్‌కీ ఆమ్ నాగరిక్’ (ఉడాన్) పథకం కింద మామునూరు ఎయిర్‌పోర్టును అభివృద్ధి చేయాలని ప్రభుత్వం గుర్తించారు. కాగా తెలంగాణలో ఆరు కొత్త ఎయిర్‌పోర్టుల ఏర్పాటుతోపాటు, మామునూరు ఎయిర్‌పోర్టును డెవలప్ చేయాలని అప్పటి ప్రభుత్వం ఎంవోయూ కుదుర్చుకుంది. కానీ దీనికి ముందడుగు పడలేదు. తాజాగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం విమానాశ్రయాల ఏర్పాటుకు ప్రయత్నాలు చేసింది. %+వీ=% సంస్థతో పలు మార్లు చర్చలు జరపగా.. ఎట్టకేలకు 150 కిమీ నిబంధలను పక్కకు పెట్టి మామునూరులో విమానాశ్రయ నిర్మాణానికి ఒప్పుకుంది. కాగా శంషాబాద్ విమానాశ్రయానికి మామునూరు 146-148 కి.మీ.లలోపే ఉండటం గమనార్హం.

# మంత్రి కొండా సురేఖకు కోర్టు మొట్టికాయ



హైదరాబాద్,మంత్రి కొండా సురేఖకు నాంపల్లి కోర్టు మొట్టికాయలు వేసింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దాఖలు చేసిన రూ.100 కోట్ల పరువునష్టం కేసులో మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలపై నాంపల్లి కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. సురేఖ వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరంగా ఉన్నాయని మండిపడింది. ఓ బాధ్యత కలిగిన మహిళా మంత్రి ఇలాంటి కామెంట్స్ చేయడం ఆశ్చర్యాన్ని కలిగించిదని వ్యాఖ్యానించింది. అలాంటి వ్యాఖ్యలు సమాజంలో చెడు ప్రభావాన్ని చూపుతాయని తెలిపింది. ఆమె వ్యాఖ్యలను మీడియా, సోషల్ మీడియా, యూట్యూబ్, ఫేస్‌బుక్, గూగుల్ ఎ÷-లాట్‌ఫామ్‌ల నుంచి తొలగించాలని ఆదేశించింది. ఇంకెప్పుడూ కేటీఆర్ గురించి అడ్డగోలు వ్యాఖ్యలు చేయవద్దని స్పష్టం చేసింది. మంత్రి కొండా సురేఖపై భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ వేసిన పరువు నష్టం దావాపై సిటీ సివిల్ కోర్టులో విచారణ జరిగింది. కేటీఆర్‌పై చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోలను న్యూస్ ఛానళ్లు, యూట్యూబ్, సోషల్ మీడియాలో తొలగించాలని పేర్కొంది. అనంతరం తదుపరి విచారణను కోర్టు వచ్చే నెల 21కి వాయిదా వేసింది. తన పరువుకు భంగం కలిగేలా కొండా సురేఖ వ్యాఖ్యలు చేశారంటూ ఆమెపై రూ.100కోట్లకు కేటీఆర్ దావా వేసిన విషయం తెలిసిందే. గతంలోనూ కొండా సురేఖ ఇలాంటి వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల సంఘం ఈ వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించింది. అయినప్పటికీ మంత్రి కొండా సురేఖలో ఎలాంటి మార్పు రాలేదు. తన వ్యక్తిత్వ హననం చేసే విధంగా చేసే ఏ ఆరోపణలను సహించేది లేదని ఇప్పటికే కేటీఆర్ స్పష్టం చేశారు. ఇకపై తన గురించి ఇలాంటి వ్యాఖ్యలు చేసే వారికి ఆయన ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశారు. కేసులో కోర్టు తాజా కామెంట్లతో కేటీఆర్‌కు బలం చేకూరినట్లయింది. కొండా సురేఖపై దాఖలుచేసిన పరువునష్టం దావాలో కేటీఆర్ ప్రజాప్రతినిధుల కోర్టులో తన వాంగ్మూలం ఇచ్చిన విషయం తెలిసిందే. మంత్రి మాట్లాడిన మాటలు కొన్ని చెప్పలేని విధంగా ఉన్నాయని కేటీఆర్ పేర్కొన్నారు. వ్యక్తిగతంగా తనకు, పార్టీ ప్రతిష్ఠకు గండికొట్టాలనే ఉద్దేశంతో అనుచిత వ్యాఖ్యలు చేశారని తెలిపారు. బహిరంగంగా అసభ్య పదజాలాన్ని చదవడం మంచిదికాదని, ఆమె చేసిన వ్యాఖ్యలను పిటిషన్‌లో పేర్కొన్నట్టు విన్నవించారు. కావాలని తనపై నిరాధార ఆరోపణలు చేశారని కేటీఆర్ చెప్పారు. ఆ వ్యాఖ్యలు టీవీ చానళ్లు, సామాజిక మాధ్యమాలు, డిజిటల్ మీడియాలో ప్రసారం అయ్యాయని, ఆ వార్తా కథనాల ద్వారా సాక్షులుగా ఉన్నవారు తీవ్ర కలత చెందారని తెలిపారు. టీవీల్లో, పత్రికల్లో, సామాజిక మాధ్యమాల్లో, డిజిజల్ మీడియాలో వచ్చిన వార్తాకథనాలకు సంబంధించిన క్లిప్పింగులను ఫిర్యాదు పత్రానికి జోడించినట్టు వివరించారు.

# ఉల్లి రైతుకు సున్నం!



కర్నూలు,రెండు తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా దక్షిణ భారతదేశంలో అత్యధికంగా ఉల్లిని పండించే కర్నూలు జిల్లా రైతులు మార్కెట్ మాయాజాలం ఉచ్చులో చిక్కుకున్నారు. ఉల్లికి డిమాండ్ బాగున్నా రైతుకు మాత్రం న్యాయమైన ధర దక్కడం లేదు. బహిరంగ మార్కెట్లో ఉల్లి కిలో రూ.60పైనే ఉంది. రైతుకు మాత్రం కిలోకు రూ.25 నుంచి రూ.35 మధ్య మాత్రమే ధర లభిస్తోంది. బహిరంగ మార్కెట్లో వినియోగదారులు అధిక ధరకు కొనుగోలు చేయాల్సి వస్తోంది. దళారులు లాభాలు మూటగట్టు కుంటున్నారు. వ్యాపారులు సిండికేటై రైతులకు ధర దక్కనీయకుండా చేస్తున్నారు. గతేడాది సీజన్ కంటే ఈ ఏడాది సీజన్లో రైతులకు ఇచ్చే ధరను తగ్గించేశారు. మాన్యువల్ విధానంలో ఉల్లి కొనుగోలులో వ్యాపారులు సిండికేటై రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నారు. కర్నూలు మార్కెట్లో 220 మంది కమిషన్ ఏజెంట్లు ఉన్నారు. ఈ నామ్ విధానంలో అయితే వారు ధరను ఆన్‌లైన్ నమోదు చేయాల్సి ఉంటుంది. మరో వ్యక్తికి ధర తెలిసే అవకాశం ఉండదు. ఈ నామ్ కాకుండా ఆఫ్‌లైన్ విధానంలో కొంటుండడంతో కమీషన్ ఏజెంట్లు అందరూ మాట్లాడుకుని రైతు పంటకు ధరను నిర్ణయిస్తున్నారు. గతేడాది అక్టోబర్‌లో క్వింటాలు ఉల్లికి గరిష్టంగా రూ.5,598 దక్కింది. ఈ ఏడాది మాత్రం రూ.4,500 దాటలేదు. ఖరీఫ్‌లో ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఉల్లి సాధారణ సాగు ఆరు లక్షల ఎకరాలు కాగా, ఈ ఏడాది 5.8 లక్షల ఎకరాల్లో వేశారు. ఎకరం విస్తీర్ణంలో ఉల్లి సాగుకు రూ.80 వేల వరకూ పెట్టుబడి అవుతోంది. విత్తనాలకు రూ.10 వేలు, రసాయనిక ఎరువులకు రూ.17 వేలు, సేద్యానికి రూ.4 వేలు, కలుపు తీయడానికి రూ.15 వేలు, క్రిమిసంహారక మందులకు రూ.20 వేలు, కోతలకు రూ.10 వేల వరకూ ఖర్చవుతోంది. ఇటీవల వర్షాలు కురిసి ప్రస్తుతం తెరపి ఇవ్వడంతో మళ్లీ వర్షాలు కురిస్తే ఉల్లి కుళ్లిపోతుందన్న భయంతో రైతులు ఉల్లి కోతలపై దష్టి పెట్టారు. రైతులు ఒకేసారి ఉల్లి కోసి మార్కెట్‌కు తీసుకొస్తుండడంతో రికార్డు స్థాయిలో సరుకు వస్తోంది. గతేడాది అక్టోబర్‌లో అత్యధికంగా ఒకే రోజు 8,380 క్వింటాళ్ల ఉల్లి కర్నూలు మార్కెట్‌కు వచ్చింది. ఈ ఏడాది ఈ రికార్డు బ్రేక్ అయింది. బుధవారం (ఈ నెల 23న) ఒక్క రోజే 19,870 క్వింటాళ్ల ఉల్లి మార్కెట్‌కు వచ్చింది. దీంతో, మార్కెట్‌లోని షెడ్లన్నీ ఉల్లితో నిండిపోయాయి. ఈ నెల 5న 11,150 క్వింటాళ్లు, 9న 10,968 క్వింటాళ్లు, 21న 13,070 క్వింటాళ్ల ఉల్లి వచ్చింది. ప్రస్తుతం క్వింటాలు ఉల్లి కనిష్టంగా రూ.444, మధ్యస్తంగా రూ.3,589, గరిష్టంగా రూ.4,581 పలికింది. మార్కెట్‌కు వస్తున్న ఉల్లిలో అత్యధికం మొత్తానికి క్వింటాలుకు రూ.2500 నుంచి రూ.3500 మధ్య మాత్రమే ధర లభిస్తోంది. బహిరంగ మార్కెట్లో ఉన్న ధరలో సగం మాత్రమే రైతుకు వస్తోంది. వ్యాపారులు రైతు నుంచి తక్కువకు కొని మార్కెట్లో ఎక్కువ ధరకు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. ప్రస్తుతం ఈ నామ్ విధానం పని చేయకపోవడం వల్ల ధరల ఖరారు, తూకాలు, బిల్లుల చెల్లింపులోనూ తీవ్ర జాప్యం జరుగుతోంది. మరోవైపు ఉల్లితో మార్కెట్ నిండిపోవడంతో ఇతర ఉత్పత్తులు ఏవీ మార్కెట్‌కు తీసుకురావద్దంటూ మార్కెట్ అధికారులు ప్రకటించారు.

మాట్లాడుకుని తక్కువ ధర ఇచ్చారు

%ఎకరా విస్తీర్ణంలో ఉల్లి సాగు చేశాను. మళ్లీ వర్షం వస్తుందనే భయంతో ఉల్లి కోసి మార్కెట్‌కు తెచ్చాం. 40 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఈ నామ్ విధానం పనిచేయలేదని చెబుతున్నారు. కమీషన్ ఏజెంట్లు వచ్చి ఉల్లిని చూసి వెళ్లి క్వింటాలు రూ.3,200 చొప్పున కొనుగోలు చేశారు. వారందరూ ముందే మాట్లాడుకొని ఆ ధరకు కొన్నారు.

రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రైతు బజార్లలో ఉల్లి విక్రయించేందుకు ప్రభుత్వం కర్నూలు మార్కెట్ నుంచే కొనుగోలు చేస్తోంది. ఇప్పటి వరకూ 111 టన్నుల ఉల్లిని కొనుగోలు చేసింది. తాడేపల్లిగూడెం వంటి ఇతర మార్కెట్లలో లభిస్తున్న ధరే కర్నూలు మార్కెట్‌లోనూ వస్తుండడంతో రైతులందరూ ఉల్లిని కర్నూలుకు తీసుకొస్తున్నారు. ఉల్లి విక్రయాలపై రైతులకు ఎప్పటికప్పుడు సూచనలు ఇస్తున్నాం. రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

## తదుపరి సీజేఐ ఆయనే

న్యూఢిల్లీ,భారత తదుపరి ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)గా జస్టిస్ సంజీవ్ ఖన్నా నియామకానికి కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ఆమోదం తెలిపింది. ప్రస్తుతం సుప్రీంకోర్టులో మొదటి ప్యూస్నే న్యాయమూర్తిగా పనిచేస్తున్న జస్టిస్ ఖన్నా, ప్రస్తుత చంద్రచూడ్ పదవీ విరమణ తర్వాత నవంబర్ 11న ఆ పదవిని చేపట్టనున్నారు. చంద్రచూడ్ గతంలో జస్టిస్ ఖన్నా పేరును తుదిపరి ప్రధాన న్యాయమూర్తి పదవికి సిఫార్సు చేశారు. ప్రస్తుత న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ 65 ఏళ్ల వయసులో పదవీ విరమణ చేసిన ఒక రోజు తర్వాత, నవంబర్ 11న జస్టిస్ సంజీవ్ ఖన్నా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. జస్టిస్ చంద్రచూడ్ నవంబర్ 8, 2022న సీజేఐగా బాధ్యతలు స్వీకరించారు.

# నెరవేరుతున్న ఏపీ ప్రజల ఆశలు..కేంద్రం నుంచి భారీగా నిధులు



అమరావతి: ఏపీ ప్రజల ఆశలు నెరవేరుతున్నాయి రాజధాని వాసుల కలలు చిగురిస్తున్నాయి. ప్రతి దాంట్లో ఏపీకి కేంద్రం నుంచి అగ్ర తాంబూళం అందుతోంది. అడిగిందే తడువుగా ఏపీకి నిధుల వరద పారిస్తోంది. ఒక్క రాజధానికే కాదు శ్రీకాకుళం నుంచి శ్రీకాళహస్తి వరకు అమలాపురం నుంచి అనంతపురం వరకు. నవ్యాంధ్ర నలుమూలలా అభివృద్ధి జరిగేలా భరోసా దక్కుతోంది. కేంద్రం సరైన సమయంలో సహకారం అందిస్తూ ఉండడంతో కీలక ప్రాజెక్టులు పట్టాలెక్కుతున్నాయి.

రూ.2,245 కోట్లతో 57 కి.మీ. రైల్వేలైన్ నిర్మాణం

తాజాగా అమరావతి రైల్వే అనుసంధానం ప్రాజెక్టుకు సెంట్రల్ కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 2 వేల 245 కోట్ల రూపాయలతో 57 కి.మీ అమరావతి రాజధానికి కొత్త రైల్వే లైన్ ఏర్పాటు కానుంది. అమరావతి నుంచి హైదరాబాద్, చెన్నై, కోల్‌కతాకు నేరుగా అనుసంధానం చేస్తూ కొత్త లైన్ నిర్మాణం జరగనుంది. ఈ ప్రాజెక్టులో భాగంగా కృష్ణా నదిపై 3.2 కి.మీ పొడవైన వంతెన నిర్మాణం చేపట్టనున్నారు. ఇదే కాకుండా మరో గుడ్ న్యూస్ చెప్పింది కేంద్రం. ఏపీలో రహదారుల అభివృద్ధికి రూ.252.42 కోట్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపింది. శ్రీకాకుళం జిల్లా రణస్థలం వద్ద 6 వరుసల ఎలివేటెడ్ కారిడార్ నిర్మిస్తున్నట్లు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ప్రకటించారు.

బడ్జెట్లో ఏపీకి రూ.15 వేల కోట్లు

కేంద్రం తోడ్పాటుతో జవసత్వాలు పొంది.. అమరావతి మహా నగరంగా రూపుదిద్దుకుంటుందన్న ఆశలు మొలకెత్తుతున్నాయి. అమరావతి నిర్మాణానికి కేంద్రం భరోసా ఇవ్వడమే కాకుండా.. బడ్జెట్లో భారీగా రూ.15 వేల కోట్లు ప్రకటించింది. ఇవే కాకుండా, పోలవరంకు 12 వేల కోట్లు, కేపిటల్ ఇన్వెస్ట్మెంట్ కింద మౌలిక సదుపాయాల కల్పనకు 2400 కోట్లు, ఇండస్ట్రియల్ కారిడార్ పేరిట 5000 కోట్లు, 15 వ ఆర్థిక సంఘం నిధులు 1450 కోట్లు, విశాఖ, విజయవాడలలో మెట్రోలకు 40 వేల కోట్లకు అనుమతులు, ఏపీ అమరావతి నిర్మాణం కోసం ఏపీ సీఆర్డీయేకు 11వేల కోట్ల రుణం.. ఇలా ఏపీ ప్రభుత్వం విజ్ఞప్తులకు వెనువెంటనే స్పందిస్తూ డబ్బులు కేటాయిస్తోంది కేంద్రం. ఇటీవల వరదలతో తీవ్రంగా నష్టపోయిన ఏపీని ఆదుకునేందుకు1,036 కోట్ల రూపాయల నిధులను కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో పోలవరం, విశాఖ, విజయవాడలో మెట్రో రైల్, అమరావతి లాంటివి విభజన హామీల్లో ఉన్నవే. కానీ గతంలో వీటికి కేంద్రం నుంచి పెద్దగా సహకారం లభించలేదు. కానీ ఇప్పుడు కేంద్రంలో చంద్రబాబుకు ఉన్న పరపతి వేరు. ఏపీ శాసిస్తే%ా%. కేంద్రం పాటించాలి అన్నట్లు పరిస్థితి మారింది. ఇటు నుంచి చంద్రబాబు రిక్వెస్ట్ సిగ్నల్‌కు కేంద్రం నుంచి గ్రీన్ సిగ్నల్స్ వస్తున్నాయి. దీంతో 2027 టార్గెట్ చంద్రబాబు ముందుకు వెళ్తున్నారు. 2027లోపు రాష్ట్ర అభివృద్ధికి కావాల్సిన మరిన్ని నిధులు పొంది.. ప్రాజెక్టులను పూర్తి చేయడానికి కసరత్తు చేస్తున్నారు. మొత్తంగా జరుగుతున్న పరిణామాలన్నీ శుభ పరిణామాలని అటు ప్రభుత్వం.. ఇటు ప్రజలు భావిస్తున్నారు.

## ఒకేసారి 16 ఏనుగుల గుంపు..

చిత్తూరు జిల్లాలోని పులిచెర్ల మండలం పాలెం పంచాయితీ గుట్టమీద పల్లె సమీపంలో 16 ఏనుగుల గుంపు హల్‌చేసింది. దీంతో సమీప గ్రామాల ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఒక్కసారి వచ్చిన ఏనుగుల గుంపు పంట పొలాలపై దాడికి దిగాయి. మామిడి తోటల్లో ఏనుగుల గుంపు మాటు వేసింది. సమాచారం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు పోలీసులు అక్కడకు చేరుకుని ఏనుగుల గుంపును అడవిలోకి మళ్లించేందుకు ప్రయత్నిస్తున్నారు. గత నెల రోజుల నుంచి కల్లూరు, పులిచెర్ల మండలాల్లో పలు గ్రామాల్లో వరుసగా పంటలపై రెండు మూడు ఏనుగులు దాడి చేస్తున్నాయి. అయితే ఈరోజు ఉదయం ఏకంగా 16 ఏనుగుల గుంపు ప్రత్యక్షం కావడంతో ప్రజలు హడలెత్తిపోతున్నారు.ఒంటరి ఏనుగు యమా డేంజర్ అయితే గుంపు ఏనుగుల కంటే ఒంటరి ఏనుగు చాలా ప్రమాదకరమైందని చెప్పుకోవచ్చు. గుంపు ఏనుగులను ఏదో రకంగా భయపెట్టిస్తే అక్కడి నుంచి వెళ్లిపోతాయి.

# ఆరోగ్య సమస్యలుంటే నడక మార్గంలో రావద్దు



తిరుపతి,తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి దర్శనానికి ప్రతీరోజూ వేలాది మంది భక్తులు తరలివస్తుంటారు. శ్రీవారిని నడకమార్గంలో వెళ్లి దర్శించుకునే భక్తుల సంఖ్య కూడా పెద్ద సంఖ్యలో ఉంటుంది. అయితే గుండె సంబంధిత సమస్యలు, పలు అనారోగ్య సమస్యలు ఉన్న వారు నడకమార్గంలో వెళ్లడం వల్ల ఎన్నో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇలాంటి వారి కోసమే టిటిడి కీలక సూచనలు చేసింది. 60 ఏళ్లు దాటిన వృద్ధులు, మధుమేహం, అధిక రక్తపోటు, ఉబ్బసం, మూర్ఛ, కీళ్ల వ్యాధులు ఉన్న భక్తులు తిరుమలకు కాలినడకన రావడం మంచిది కాదు. ఊబకాయంతో బాధపడుతున్న భక్తులు, గుండె సంబంధిత వ్యాధులు ఉన్నవారు తిరుమల కొండకు నడక దారిన రావడం శ్రేయస్కరం కాదు. తిరుమల కొండ సముద్ర మట్టానికి చాలా ఎత్తులో ఉండటం కారణంగా ఆక్సిజన్ స్థాయి తక్కువగా ఉంటుంది. కాలినడకన రావడం చాలా ఒత్తిడితో కూడుకున్నది.. కాబట్టి గుండె సంబంధిత వ్యాధులు, ఉబ్బస వ్యాధిని తీవ్రతరం చేసే అవకాశం ఉంది.. కనుక భక్తులు తదనగుణంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న భక్తులు వారి రోజువారి మందులు వెంట తెచ్చుకోవడం ద్వారా సమస్యలను నివారించవచ్చు. కాలినడకన వచ్చే భక్తులకు ఏమైనా సమస్యలు ఎదురైతే అలిపిరి కాలిబాట మార్గంలోని 1500 మెట్టు, గాలి గోపురం, భాష్యకార్ల సన్నిధి వద్ద వైద్య సహాయం పొందవచ్చు. తిరుమలలోని అశ్వినీ ఆసుపత్రి, ఇతర వైద్యశాలల్లో నిరంతర వైద్య సదుపాయం పొందవచ్చు. దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధిగ్రస్తులకు అత్యవసర పరిస్థితుల్లో తిరుపతిలోని స్విమ్స్ ఆసుపత్రిలో డయాలసిస్ సౌకర్యం అందుబాటులో ఉంది. తిరుమలకు కాలినడకన రాదలచిన భక్తులు పై సూచనలను తప్పనిసరిగా పాటించాలని.. తమకు సహకరించాలని ఓ ప్రకటనలో టిటిడి విజ్ఞప్తి చేసింది.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com